# తల్లీ కొడుకులు

"వారం రోజులు సెలవు పెట్టేశాను గీతా! తిరపతి వెళ్ళొద్దాం!"

కొడుకు, కోడలితో చెప్తోన్న మాటలు సంబరంగా వింది కాంతమ్మ. 'తి... ర... ప... తి' అన్న నాలుగక్షరాలూ కాంతమ్మ కడుపులో పుట్టెడు సంతోషం కలిగించాయి.

తిరుపతి గురించీ, తిరుపతి దేవుణ్ణి గురించి వినీ వినీ, బతుకులో ఎప్పుడయినా ఒక్కసారి ఏడుకొండల వాణ్ణి కళ్ళారా చూడాలన్న కోరిక గుండెల్లో పెట్టేసుకుంది కాంతమ్మ. ఆపద మొక్కులవాడు .... వడ్డి కాసులవాడు .... సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడు .... కళ్ళపడాలంటే ఎంత పుణ్యం చేసుకోవాలీ! వెంకటేశ్వరుణ్ణి గురించి .... ఎన్ని చరిత్రలు .... ఎన్ని మహత్యాలు .... ఎన్ని .... ఎన్నెన్ని వింది! చిన్న తిరుపతి దాటి ... ఏడుకొండలూ ఎక్కి .... పుష్కరిణిలో శుచిగా స్నానంచేసి .... ఆపద మొక్కులవాణ్ణి దర్శనం చేసుకొని ... పాపనాశనంలో పాపాలు పోగొట్టుకుని .... గోగర్భం దగ్గిర ఒక దణ్ణం పెట్టి .... మంగాపురంలో అలిమేలు మంగ తాయారమ్మకు మొక్కి .... అబ్బ! ఆలోచిస్తేనే ఒళ్ళంతా పులకరిస్తోందే! అవన్నీ నిజంగా చూస్తే?

తిరుపతి దేవుణ్ణి చూస్తానన్న ఆలోచనతోనే కాంతమ్మ మొహం విప్పారి పోయింది. "అబ్బాయ్! తిరపతి అయితే మీతో నేనూ వస్తానురా! ఏడు కొండల వాణ్ణి చూస్తాను" అంది కొడుకుతో.

ఆ మాట అనేసి సంతోషం కొద్దీ అక్కడ నించో లేకపోయింది. 'తిరుపతి వెళ్ళే కబురు వింటే నాగరత్తం ఎంత ముచ్చట పడుతుందో' అనుకుంటూ వాకిట్లోకి వెళ్ళిపోయింది.

భార్యకేసి చూశాడు రామం.

గీత, అదేం పట్టించుకోకుండా గదిలోకి వెళ్ళిపోయింది. రామం గదిలోకి వెళ్ళేసరికి మంచం మీద పడుకుని వుంది గోడవేపు తిరిగి.

రామం వెళ్ళి భార్యపక్కలో కూర్చున్నాడు. "మా అమ్మ కూడా వస్తానంటోంది."

"............................"

"మాట్లాడవేం?"

"ఏం మాట్లాడను?"

"మా అమ్మ కూడా వస్తుందంట."

"నాకెందుకూ చెప్పటం?"

"పోనీ తీసుకెళ్దాం. దేవుణ్ణీ చూస్తానంటోంది. ఆవిడ మాత్రం ఇంకెప్పుడు చూస్తుంది?"

"......................"

"మాట్లాడవేం? నీకిష్టం లేదా?"

గీత కాస్సేపు మాట్లాడలేదు. లేచి కూర్చుంది. "మన మిద్దరం సరదాగా ఊళ్ళు చూద్దాం అనుకుంటోంటే, ఆవిడెందుకూ మన మధ్య?"

"నిజమే అనుకో. ఆ విషయం అమ్మకి తెలియాలిగానీ...."

"తెలియకపోతే చెప్పండీ! మీరు వూరుకుంటే ఇంకెలా తెలుస్తుంది?"

"......................"

"మాట్లాడరేం? మనం తిరిగేది తిరుపతి ఒక్కటే కాదు గదా? మెడ్రాసు చూడాలనుకున్నాం. బెంగుళూరులో ఫ్రెండ్స్ నెవర్నో కలుసుకోవాలన్నారుగా? ఆవిడ కూడా వస్తే ఇవన్నీ ఎలా అవుతాయి?"

ఆ మాటలన్నీ గీత నోట్లోంచి వచ్చాయిగానీ, అవన్నీ రామం మనసులో కూడా వున్న మాటలే. తల్లి కూడా ఎందుకూ తమతో పాటూ?

తిరపతి వెళ్ళటం దేవుణ్ణి చూడాలనే కాదు. తిరుపతి కొండల ప్రకృతి సౌందర్యం గురించి ఎంతో మంది ఎన్నో విధాల చెప్తారు. 'అందాల' భార్యతో కలిసి ఆ కొండల్లో కోనల్లో విహరించాలి.

అంతేకాదు, మద్రాసులో తప్పకుండా ఆగాలి. ఆ మహానగరాన్నంతా గీతకి చూపించాలి. స్టుడియోలు — పార్కులు — బీచ్‌లు — థియేటర్లు — బజార్లు — ఎన్నో చూడాలి. వీలైతే యాక్టర్స్‌ని చూడాలి. ఒకరిద్దరు ఫ్రెండ్స్‌ని చూడాలి. మొత్తంగా ఈ ప్రయాణ

మంతా ఒక మధురస్మృతిలాగ చేసుకోవాలి.

పెళ్ళయిన రెండేళ్ళ కాలంలోనూ — అందాల భార్యతో కలిసి ఎన్ని షికార్లు తిరిగినా, ఎన్ని సినిమాలు చూసినా, ఎన్ని విహారాలు చేసినా, ఎంత ఆనందం అనుభవించినా, ఇంకా ఇంకా కోరికలు పుడుతూనే వున్నాయి. ఉత్సాహం ఉరకలు వేస్తూనే వుంది.

ఇప్పుడీ ప్రయాణంలో అమ్మని వెంటబెట్టుకు పోతే....?

ఆవిడేం అల్లరిపెట్టే మనిషి కాదు. ఎక్కడ వుండ మంటే అక్కడే వుంటుంది. ఎలా చెప్తే అలాగే వింటుంది. కానీ ....

అందాల గీతని ఎవరికైనా చూపిస్తూ — "నా భార్య" అని గర్వంగా చెప్పుకోగలడు. కానీ, కాంత మ్మని ... నల్లటి నలుపు ... ఎత్తుపళ్ళు ... నిమ్మకా యంత జుట్టుముడి ... నీరుకావి సైను గుడ్డలు .... ఆ ఆకారంతో వుండే తల్లిని — "ఈవిడ మా అమ్మ" అని ఎలా చెప్పుకోగలడు?

అసలు అమ్మకి తిరపతెందుకూ? దేవుడు ఎక్క డైనా వుంటాడు. పెద్ద వయసులో అంతంత ప్రయాణా లెందుకు? ఇంట్లో వుండి .... వంట చేసిపెడుతూ కొడుకు ఆనందాన్ని చూసుకుంటే చాలదా పెద్ద వాళ్ళకి? .... 'అమ్మ' అయితే మాత్రం? చిన్న వయసు వాళ్ళతో కలిసి తిరగాలంటే .... పెద్దవాళ్ళని తిప్పడం .... కష్టం!

గీత జడ అల్లుకుని లేచే దాకా రామం, ఆలో చనలతో సతమతమయ్యాడు.

ఆ చిలకా గోరింకల మధ్య ముసలి తల్లి ప్రసక్తి మళ్ళీ రానేలేదు. కానీ ఆ ఇద్దరికీ స్పష్టమే జరగ బోయేది — తల్లికి తప్ప!

★ ★ ★

తిరపతి ప్రయాణం ఒక్క రోజులోకి వచ్చింది. ఆ రోజు కూడా గడిచి, పూటల్లోకి వచ్చింది. సాయంత్రం రైలుకే ప్రయాణం!

పొద్దున్ననించీ ఒకటే చినుకులు! జల్లులు! ముసురు!

"అబ్బాయీ! వాన ఇల్లా కురుస్తోంది. ప్రయాణం కుదురుతుందంటావా?" భయంగా అడిగింది తల్లి.

"రైల్లో వెళ్ళే వాళ్ళకి వానా గీనా ఏమిటి?" అన్నాడు కొడుకు మొహం ఎటో పెట్టి.

"అవున్లె, రైలేగా?" కాంతమ్మ మనస్సు కుదుట పడింది.

వర్షం కాస్త తెరిపిచ్చింది.

కొడుకూ కోడలూ బెడ్డింగు సర్దుకుంటోంటే కాంతమ్మ గబగబా వంట ముగించి తెల్లగా వుతు క్కున్న చేతి సంచీలో రెండు పంచెలూ, ఒక దుప్పటీ పాత పంచిగుడ్డలూ సర్దుకుంది. తల దువ్వుకోటానికో చెక్కదువ్వెన పడేసుకొంది.

కొడుకూ కోడలూ అన్నాలు తింటోంటే కాంతమ్మ గబగబా పెరటిగోడ దగ్గరికి వెళ్ళింది. "అమ్మాయ్ నాగరత్తం! అంతా అయినట్టేనమ్మా. వాళ్ళిద్దరూ భోజ నాలు చేస్తున్నారు. నేను కూడా ఒక ముద్ద తిని .... ఏం తినటమోలే, కడుపంతా నిండిపోయినట్టే వుంది .... గిన్నెలు కడిగేస్తాను. కాస్త ఇల్లు కనిపెట్టి చూస్తూ వుండమ్మా! బంతి పువ్వులు నువ్వు కోసుకో. మొన్నే చెప్పానుగా?" అని నాగరత్తానికి అప్పగింతలు పెట్టింది.

"అలాగేలే పెద్దమ్మా! జాగర్తగా వెళ్ళి రండి. ఎంత పుణ్యం చేసుకున్నారో, వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటున్నారు. ఆ రోజు మా కెప్పుడొస్తుందో! నీకూ తెలుసుగా, మా పెద్ద వాడికి మొక్కువుంది; ముడుపు కూడా కట్టాను."

"పోనీ ఆ ముడుపు నా కిస్తావా? జాగర్తగా సంచీలో పెట్టి తీసుకెళ్ళి దిబ్బెంలో పడేస్తాను."

"అలా కుదురుతుందా? ఇప్పుడొద్దులే. ఒకసారి మేమందరం ఎలాగా వెళ్ళాలనుకుంటున్నాంలే."

"సరేలే అయితే, నీ చెత్తోటే ముడుపు ఇచ్చు కుందువుగాని...."

"ముందు నువ్వు చూసి వచ్చి అన్నీ చెప్పాలి సుమా!"

కాంతమ్మ ముసిముసిగా నవ్వుకుంటూ "ఎళ్తా నమ్మా!" అనేసి ఇంట్లోకి వచ్చేసింది.

ఎంగిలి పళ్ళాలు రెండూ గడప దగ్గిరే వదిలేసింది కోడలు. అత్తగారు ఆ పళ్ళాలు కడిగేసి లోపల పడే సింది.

కోడలు తలదువ్వుకుని రింగుపెట్టి ముడి

చుట్టుకుంటోంటే, కొడుకు, వెనగ్గా నిలబడి ఏదో సాయం చేస్తున్నాడు.

కాంతమ్మ నవ్వుకుంటూ గబగబా తన పళ్ళెంలో రెండు ముద్దలు పెట్టుకుంది.

గీత తీసిపెట్టుకున్న జరీ చీర రామానికి నచ్చలేదు — "ఎర్ర సిల్కుచీర కట్టుకో" అన్నాడు.

"అబ్బ! ఇంత చలిగా వుంది. సిల్కు చీరేమిటి?" అంది గీత.

"నీ మొహం! చలేమిటి?" అంటూ రామం జరీ చీర లోపల పెట్టేసి టెర్లిన్ చీర తీసి ఇచ్చాడు.

ముస్తాబంతా పూర్తి చేసుకున్న గీత, దంతం బొమ్మలా తయారైంది. రామం చిలిపిగా క్రీగంట చూస్తోంటే సిగ్గుపడిపోయి అద్దం వేపు మొహం తిప్పేసింది.

రాము, కాస్సేపు వీధి గుమ్మంలో నిలబడి రోడ్డు మీద పోతోన్న రిక్షాని చప్పట్లు కొట్టి పిల్చాడు.

కాంతమ్మ ఎప్పుడో గిన్నెలన్నీ కడిగి బోర్లించేసింది. దొడ్డివేపు తలుపులు వేసేసి తన చేతి సంచిని దగ్గిర పెట్టుకుని కూర్చుంది.

రిక్షా మనిషి బెడ్డింగూ పెట్టీ రిక్షాలో పెట్టాడు.

గీత వెళ్ళి రిక్షాలో కూర్చుంది. "ఇంకో రిక్షాని పిలుస్తాడా అబ్బాయి?" అనుకుంటూ రోడ్డువేపు చూసింది కాంతమ్మ.

రామం కూడా బూట్లు వేసుకుని నిలబడ్డాడు. పర్సులోంచి పది రూపాయల నోటు తీసి తల్లిచేతి కివ్వబోయాడు.

కాంతమ్మ అయోమయంగా చూసింది 'ఏవిట' న్నట్టు.

"నీ దగ్గర వుంచుకో. ఏవన్నా కావాలంటే తెప్పించుకోవచ్చు. ఈసారి పెద్ద వాళ్ళెవరైనా వెళ్తోంటే నిన్ను పంపిస్తాలే. మాకు మద్రాసూ అదీ వెళ్ళాల్సిన పని వుంది. వారం రోజులు పడుతుంది. వెళ్తాను మరి. రైలుకి టైమైపోతోంది" అంటూ ఆ నోటుని తల్లి సంచి మీద పెట్టాడు.

వెనక్కి చూడకుండా గబగబా అడుగులు వేసుకొంటూ వెళ్ళి కొడుకు రిక్షాలో కోడలి పక్కన కూర్చోడం చూసింది కాంతమ్మ.

రిక్షా కదిలి నీళ్ళు చిందించుకుంటూ వెళ్ళిపోయింది.

అసలేం జరిగిందో అర్థం కాలేదు కాంతమ్మకి.

తెల్లబోతూ ... నిర్ఘాంతపోతూ ... అక్కడే చీకట్లో నిలబడి నిలబడి ... నెమ్మదిగా కాళ్ళ దగ్గిర సంచి మీదకి కుప్పలా కూలిపోయింది!

★ ★ ★

కాంతమ్మ దౌర్భాగ్యం ఈనాటిది కాదు. అది పసితనం నించే కాంతమ్మని అంటి పెట్టుకుని తిరుగుతోంది.

కాంతం, పల్లెటూళ్ళో, పేద కుటుంబంలో పుట్టింది.

తొలిచూలులో కొడుకునే కనాలని సంబరపడిన మంగమ్మ, నల్లగా .... వికారంగా .... ఎలుకపిల్లలా పుట్టిన కూతుర్ని చూసుకుని బావురుమని ఏడ్చింది.

"పోనీ దేవుడిచ్చాడు, ఆడో, మొగో. కాస్త అందంగా అన్నా పుట్టి చచ్చిందా" అంటూ పూట పూటా ఘొల్లుమనేది మంగమ్మ.

"ఊరుకోవే మంగమ్మా, నీకు లేని అందం దానికెలాగొస్తుందే? నువ్వేం ఎర్రగా బుర్రగా రంభలా మిడిసిపడిపోతున్నావా?" అని ఎవరన్నా వేళాకోళం ఆడితే, కుక్కిన పేనులాగ నోరు మూసేసుకునేది.

"వయసొస్తే వంకర కాళ్ళు తిన్ననవుతాయి. ఈడొస్తే సరి. అదే సొగ్గా వుంటది" అని ఏ పేరంటక్కా మంగమ్మని ఓదార్చేది.

కాంతమ్మకి ఏడాది పిల్లప్పుడు, నల్లటి మొహంలో తెల్లటి ఎత్తుపళ్ళు పొడుచుకొస్తోంటే, 'ఇదేం ఖర్మరా దేవుడా!' అని మంగమ్మ భోరుభోరున ఏడ్చేది.

నెలల తరబడీ కాంతం గురించే విచారిస్తూ కూర్చోటానికి తర్వాత పుట్టిన పిల్లమాటో? అదీ ఆడముండే! కాకపోతే కాంతం కన్నా ఒక ఛాయ మెరుగు. దాని తర్వాత కూడా ఇంకా ఇద్దరు ఆడపిల్లలు! నిండా మునిగిదానికి చలేవిఁటన్న ధోరణిలో పడింది మంగమ్మ. అన్నిటికీ కోపం కాతం మీదే! "ముందీ కోతి ముండ పుట్టకుండా వుంటే, అందరూ మొగపిల్లలయ్యే వాళ్ళు" అనేది మంగమ్మ. చీటికీ మాటికీ కూతుర్ని తిడుతూ.

ఏడాది తిరక్కుండా పాలు మానిపించేసిన్నాడే

పిల్లకీ తల్లికీ ఎడబంధాలై పోయింది. అమ్మా అయ్యా చేరదియ్యక పోయినా.... లాలించక పోయినా.... ఆడపిల్లలంతా గాలికీ దూళికీ పెరిగారు.

ఐదోసారి నీళ్ళాడి కొడుకుని కంది మంగమ్మ. ఆ రోజు తల్లిదండ్రుల మొహాలు చూసిన కాంతం తెలిసీ తెలీని ఊహలతో తనుకూడా సంతోషపడింది.

ఎన్నడూ పిల్లల్ని ఎడం చేత్తోకూడా ముట్టుకోని అయ్య, పురిటినాడు అంత చంటి వెధవనీ పొత్తిళ్ళలో పెట్టుకుని కూర్చున్నాడు. పిల్లాడికి శాంతి చేయించి పంతుళ్ళకు సంభావనలవీ ఇచ్చారు. పసివాడికి మురుగుల్లూ, మొల్లో పిందెలూ చేయించి కట్టారు. తర్వాత మాత్రం? వాడికెన్ని ముద్దు ముచ్చట్లు జరిగాయి! ఎన్ని అంద చందాలు జరిగాయి!

తమ్ముడు తప్పటడుగులేస్తూ మీద పడి తొక్కినా, గుప్పెళ్ళకొద్దీ అప్పల జుట్లన్నీ పీకినా, కర్రలు పెట్టి అప్పల్ని బాదినా, మొగ పిల్లోణ్ణి ముద్దుగానే చూడాలనేది మంగమ్మ.

మిగతా పిల్లలకి ముద్దూ ముచ్చట్లూ లేకపోయినా తిట్లూ దీవెనలూ లేవు. అన్నీ కట్టకట్టుకుని కాంతం వొంతే అయ్యేవి.

కాంతానికి పన్నెండో ఏడు కూడా జొరబడింది. పాత కోకల్లో గుడ్డలు పమిటలు కూడా వేసుకుంటోంది.

మంగమ్మ ఏటేటా చూలింతా బాలింతా అయి రోగాలతో .... తెగుళ్ళతో .... సంవత్సరానికి సగం రోజులు ముక్కుతూ మూలుగుతూ పడుకుంటే ... చేతికి సాయంగా వుండేది కాంతం ఒక్కతే. ఏదో బాముకోవాలని అందరికన్నా ముందు పుట్టి చచ్చింది కాబట్టి, తాడిని తలదన్నేలా ఎదగడం మొదలెట్టింది.

తల్లి కాస్త నిదానంగా మాట్లాడినపూట కాంతానికి గంపెడు ఆనందంగా వుండేది. తల్లి మెప్పు పొందాలన్నట్టు ఇంట్లో పనులన్నీ చెప్పకుండా చేసుకుపోయేది. ఎప్పుడన్నా నోరు తెరిచి "అమ్మా!" అని పిలిస్తే, "ఎందుకే అమ్మా బొమ్మనూ? గొప్ప కూతురివి బయల్దేరావు" అంటూ ఈసడించేసేది కన్నతల్లి.

★ ★ ★

కాంతం ఈడేరింది.

మంగమ్మ వలవలా ఏడ్చింది. కూతురికి మొగుడెలా దొరుకుతాడా అని. కట్నాలూ కానుకలూ గుమ్మరించే మాట ఒట్టిది. పోనీ పిల్ల అందచందాలు చూపిద్దామా అంటే .... అదేగా గోలంతానూ! నల్ల రంగూ, ఎత్తుపళ్ళూ! ఇంకెవడు చేసుకుంటాడు?

ఈడేరి ఏడాది దాటిన కాంతం, మంగమ్మకి గుండెలమీద కుంపటి అయిపోయింది.

మంగమ్మ అదృష్టమో ఏమోగానీ బుచ్చిరాజు పెళ్ళాం పోయిందని కబురు తెలిసింది.

బుచ్చిరాజు, మంగమ్మ తమ్ముడే.

మంగమ్మ కన్నా రెండు మూడేళ్ళు చిన్న.

జ్వరం వచ్చి మరదలు హఠాత్తుగా పోయిందన్న కబురు తెలియగానే మంగమ్మ బుర్ర ఏదో ఆలోచన చేసింది. కలకల్లాడే మొహం బలవంతంగా మాడ్చుకుని పుట్టింటికి బయల్దేరింది.

మరదలికి దినవారాలయ్యాయి.

మంగమ్మ కొన్నాళ్ళకి తమ్ముణ్ణి వెంట దీసుకుని వచ్చింది ఇంటికి.

బుచ్చిరాజు అప్పగారింటి కొచ్చిన్నాడు కాళ్ళకి నీళ్ళిచ్చిన కాంతాన్ని ఎగాదిగా చూశాడు.

వయసొచ్చిన తర్వాత కాంతం ముద్ద బంతి పువ్వు లాగే తయారైంది.

"కాస్త పళ్ళు ఎత్తయినా కాంతం మొహం కళగా వుంటుంది" అనేవారు వాళ్ళూ వీళ్ళూ.

బుచ్చిరాజు కాంతం ఇచ్చిన చెంబుతో కాళ్ళమీద నీళ్ళు ఒంపుకుని కాసిన్ని నీళ్ళు మేనగోడలి మీద చిలకరించాడు.

కాంతం, ముందు తెల్లబోయి తర్వాత మొహం చిట్లించుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

మేనమామంటే కాంతానికి చాలా భయం! ఎప్పుడో చిన్నప్పుడోసారి అమ్మమ్మ గారింటికెళ్ళినప్పుడు, బుచ్చిరాజు నిజస్వరూపం చూసింది. కోడి పందేలకి వెళ్ళటానికి డబ్బు ఇమ్మని పెళ్ళాన్నడిగాడు బుచ్చిరాజు. తన దగ్గిరొక్క చిల్లిగవ్వ కూడా లేదంది పెళ్ళాం. గబగబా దాని పెట్టి బద్దలుచేసి గుడ్డలన్నీ చిందరవందరచేసి రెండు రూపాయలు బైటికి తీశాడు. "దొంగ ముండా! ఈ డబ్బు ఎవడికోసం దాచావే?" అని పెళ్ళాన్ని లెంపకాయలు వేశాడు.

అత్త తిట్టింది.

మళ్ళీ కొట్టాడు. జుట్టు పట్టుకుని పీకాడు. ఆ డబ్బుతో బైటికి పోయాడు.

అదంతా చూసిన కాంతం భయంతో గజగజలాడి పోయింది. మంగమ్మ కానీ, ముసిల్దిగానీ బుచ్చిరాజుని అడ్డుకోలేదు. కేక వెయ్యలేదు.

కాంతం ఒక్కతీ అత్త దగ్గిరికి వెళ్ళి కూర్చుంది. ఎడం కన్ను మీద చర్మం చిట్లి రక్తం కారి అట్టకట్టుకు పోయింది. అత్త లేచి అన్నం కూడా తినలేదు. ఏడుస్తూ .... మూలుగుతూ, పడుకుంది.

కాంతానికి మేనమామంటే తగని అసహ్యం పుట్టింది. కంటి మీద నెత్తురు అట్టకట్టి అత్త మూలు గుతూ పడుకున్న దృశ్యం కాంతానికి గుండెల్లో పచ్చి పుండులాగ వుండిపోయింది.

చిన్నతనం పోయి కాస్త వయసు వస్తోన్నకొద్దీ మేన మామ లక్షణాలన్నీ కాంతానికి అర్థమౌతూనే వుండేవి.

బుచ్చిరాజుని 'పోకిరీవోడు' అనేవారు అందరూ. గొడ్ల చావిళ్ళలో చీట్లపేకలకీ, తాటి తోపుల్లో కల్లు ముంతలకీ ఊరి పొలిమేరల్లో కోడి పందేలకీ. డప్పు మోగే చోట బోగం మేళాలకీ తిరుగుతూ, ఇల్లూ వాకిలీ .... పొలం పుట్రా .... ముసలితల్లీ .... పెళ్ళాం ఏదీ పట్టకుండా అన్నీ వొదిలేసి నిర్భూచీగా కాలం గడిపేసే వాడు.

తమ్ముడి గుణగణాలు మంగమ్మ ఎరగనివి కావు. అయినా "మొగాడికి మంచేంటి, చెడ్డేంటి?" అనేది.

సమయం చూసి తమ్ముణ్ణి కదలెయ్యాలని అప్ప అనుకుంటూ వుండగా, తిండి తిని నులక మంచం మీద కూర్చుంటూ తమ్ముడే అన్నాడు — "అప్పా, కాంతం బాగా ఎదిగిందే, రూపొచ్చింది" అని ఇకి లించాడు.

"ఆఁ, ఎదిగింది. ఎదగటానికేం బీదతనవాఁ? మొగుణ్ణెలా తేవటమా అని తలబద్దలు కొట్టుకు చస్త న్నాను" అంది అప్ప.

"అదేంటే అప్పా, ఎలాగో అవుద్దిలే. కన్నె పిల్ల మొగుడు లేకుండా వుండి పోద్దా భూమి మీద?"

అదును చూసి మంగమ్మ కడుపులో మాట కాస్తా అనేసింది — "ఇంకెలా అవుద్దిరా? మంచికే వొచ్చిందో చెడ్డకే వొచ్చిందో నీ పెళ్ళాం కన్ను మూసింది. ఎనకాల పిల్లా జెల్లా, బాదరాబందీ లేదు. ఇంక నువ్వు తప్పితే నాకెవ్వరూ కనపట్టం లేదు."

బుచ్చిరాజుకి చాలా ఆశ్చర్యం వేసింది. తన గురించి అప్పకంతా తెలుసు. అసలు .... కాంతం తనకన్నా బాగా చిన్నది.

"ఏంట్రా బుచ్చీ .... ఆలోచిస్తున్నావు?"

"అబ్బే, ఏంటీ లేదే."

"ఏం, కాంతం నీకూ నచ్చలేదా?"

"అబ్బే! అది కాదు."

తను రెండో పెళ్ళి లేకండా వుండిపోడుగానీ .... ఈ అప్ప కూతుర్ని చేసుకుంటే ... ఏం పెడద్ది ఈ అప్ప? .... ఎక్కడన్నా దూరం ఇంటి పిల్లని .... అందంగా .... సోగ్గా వున్నదాన్ని .... ఈ ఎత్తు పళ్ళ కోతి మొహంది ఎందుకు?

తల దించేసుకున్నాడు — "నాకిప్పుడు పెళ్ళేంటే అప్పా? ఒక మూల అది పోయి .... నా బతుకే బండ లయిందే!"

"అయ్యేం మాటల్రా బుచ్చీ! పోయిన దానితో పోతావా? ఇదేం పపంచకవా, వల్లకాడా? అది వున్న న్నాళ్ళూ నిన్నేం సుకపెట్టిందనీ? సీటికీ మాటికీ ఏడు పులూ మొత్తుకోళ్ళేగా? దాంతో ఏం సుకపడ్డావు?"

"అవునే" అన్నట్టు బుచ్చిరాజు సానుభూతి కోసం చూశాడు, తల వాలేసి.

అప్ప ఇక కానిచ్చింది. "కాంతం మన ఇంట్లో పిల్ల. నిన్నేం ఆఁ అంటదా, వూఁ అంటదా? కుక్కిన పేను లాగా పడివుంటది. నీ పేణానికి అంతకన్నా ఏం కావాలి?"

"సరేలేవే అప్పా! ఇప్పుడేంటి కంగారు?"

"అలాక్కాదులేరా బుచ్చీ! ఇంతదాకా వచ్చాక ఏదో ఒక మాట తేల్చేసుకోటమే మంచిది. నువ్వు కాదంటే, పిల్లకి ఏదో దారి చూసుకోవాలిగా?"

బుచ్చిరాజు పళ్ళికిలిస్తూ వేళాకోళంలోకి దింపాడు — "నీ కూతురేం అందంగా మిడిసిపడి పోతందను కుంటున్నావా? ఆ మొద్దు మొహం దాన్నెవడు కట్టు కుంటాడే అప్పా?"

మంగమ్మ కళ్ళొత్తుకుంది. "అందర్లాగా నువ్వూ అలాగంటే ఎలాగరా బుచ్చీ? తోడబుట్టిన దానికష్టం నీ కష్టం కాదంట్రా! అందం కొరుక్కు తింటావా, గుణం చూసుకోవాలిగానీ? నీ పెళ్ళాం ఎర్రగా బుర్రగా

వుండి నిన్నేం సుకపెట్టి చచ్చిందీ?"

"నిష్టూరాలాడి నీ కూతుర్ని కట్టబెడదామని చూస్తున్నావుగానీ, బావ నాకేటిస్తాడే అప్పా?"

"నీకు తెలవందేటుంది చెప్పు? ఎక్కడున్నావే గొంగళీ అన్నట్టు, ఆ నాడెలాగున్నాడో ఈనాడూ అలాగే వున్నాడు నీ బావ. ముద్ద మింగి పొలానికి పోటం తప్పితే పెళ్ళాం బిడ్డలని ఆలోచించేపాటి తెలివి ఏడి సిందా మడిసికి? నీకు కట్టబెట్టి పెద్ద దాన్ని ఇరగడ చేసుకుంటే అయ్యిందా? ఎనకాల ఇంకా దెయ్యాలు లేరూ? ఆళ్ళందరికీ ఏంటిస్తాడో నీకూ అలాగే ఇస్తాళ్ళే" — మాట్లాడుతూ మాట్లాడుతూ మంగమ్మ కళ్ళ నీళ్ళెట్టుకుంది.

బుచ్చిరాజు చూసీ చూడనట్టు వూరుకున్నాడు.

కాస్త గొంతు తగ్గించి చెప్పింది అప్ప — "నీ ముద్దూ ముచ్చటా నేను జరుపుకోక పోతానంట్రా? కాంతం గొడ్డులా చాకిరీ చేస్తది. నువ్వెటు తిరిగినా ఇంటికాడ వుండి ఎచ్చగా నీకింత వొండి పడేస్తది. పరాయి దాన్నెవతిని కట్టుకున్నా నీకింత వొద్దిగ్గా వుంటాదనుకుంటన్నావా?"

తమ్ముడు ఆలోచించాల్సిందంతా అప్పే ఆలో చించి పెట్టింది.

ఎలాగో అప్ప కోసం చివరికి కాంతాన్ని కట్టుకో టానికి ఒప్పుకున్నాడు మేనమావ!

ఆ కబుర్లన్నీ విన్న కాంతం దిగాలు పడిపోతూ తిరిగింది. పనులు చేస్తూనే వుంది, కళ్ళు తుడుచు కుంటూనే వుంది. "అమ్మా, నేను మామయ్యని చేసు కోనే!" అని చెప్పాలని కూడా కాంతానికి తోచలేదు.

తనకి పెళ్ళవ్వాలంటే ఇంకెవరు చేసుకుంటారు? మావయ్య కాబట్టి వొప్పుకున్నాడు — అని కూడా అను కుంది కాంతం.

"ఆడికి పిల్ల నివ్వటం ఏంటి? దేశ దిమ్మరెధవ" అన్నాడు కాంతం బాబు.

"నీ కూతురి అందసందాలకీ, నువ్విచ్చే కట్న కానుకలకీ ఇంకెవడొస్తాడో తీసుకురా! నా తమ్ముడు గాబట్టి .... కష్టంలో వున్నాడు గాబట్టి ... ఒప్పుకున్నాడు" అని మొగుడి నోరు మూయించేసింది మంగమ్మ.

పెళ్ళి అనుకున్న దగ్గిర్నించీ బుచ్చిరాజు కాంతాన్ని రాసుకు రాసుకు తిరగటం .... పళ్ళికిలిస్తూ నవ్వటం .... సాగించాడు. కాంతం, మొహం ముడుచుకుని తప్పుకుపోయేది.

"నీ బడాయి ఎన్నాళ్ళో నేనూ చూస్తాలేవే!" అన్నా డొకసారి ఇకిలిస్తూ.

కాంతానికెందుకో భయం వేసింది. చాటుకు పోయి బాగా ఏడ్చింది. ఎక్కువసేపు ఏడవటానిక్కూడా భయం వేసింది. తల్లి చూసిందంటే, "ఎందుకే ఏడుపూ? నీ మొహానికి ఇంకెవడొస్తాడే?" అన్నా అంటుందని తల్లికి కనపడకుండా ఏడ్చి సరిపెట్టు కుంది.

★ ★ ★

నెల లోపలే కాంతానికి బుచ్చి రాజుతో పెళ్ళయి పోయింది. గదిలోకి పంపటం కూడా అయిపోయింది. మొగుడి మీద కొత్త కొత్త ఇష్టాలేవీ పుట్టుకు రాలేదు కాంతానికి. ఉన్న అయిష్టం కూడా తగ్గలేదు.

అయినా, ఆ పెళ్ళి నాలుగు రోజులూ ఇంట్లో చాకిరీ కాస్త తగ్గింది. కొత్త కొత్త గుడ్డలవీ కట్టుకో నిచ్చింది తల్లి. బుచ్చి మావయ్య కూడా కాస్త నవ్వు తూనే మాట్లాడాడు. "నాకూ పెళ్ళయిందిలే" అను కుంది కాంతం. మెళ్ళో మంగళ సూత్రాలూ నల్ల పూసలూ కాళ్ళకి మట్టెలూ, కుంకుం బొట్టూ .... ఎప్పుడూ లేని ముస్తాము!

"కాంతానికి ఎంత కళొచ్చిందో!" అనేవాళ్ళు చూసిన వాళ్ళందరూ.

బుచ్చిరాజు మనుగుడుపులు, వరి వూడ్పుల రోజుల్లోనే. ఊడ్పులకి నాయుడుగారు తెచ్చుకున్న కూలి మనుషులు, చెరువు గట్టుకి అవతలి వేపున గొడ్లపాకల్లో మకాం పెట్టారు. సాయంత్రం బాగా చీకటి పడ్డాక పొలంలోంచి గుంపులు గుంపులుగా వచ్చి, బిలబిల్లాడుతూ పాకల్లో జేరి, గడ్డి మంటలతో నూకలు వుడకేసుకుంటూ నవ్వుతూ పేల్తూ కబుర్లాడుకునే ఆడ కూలీల్ని చూస్తూ చెరువుగట్టు మీదే నించునే వాడు కొత్త పెళ్ళి కొడుకు బుచ్చిరాజు.

కాంతం, కాస్త పెందరాడే తిండి తిని బుచ్చి రాజుకోసం చూడకుండానే పడుకుని నిద్రపోయేది. ఆ రాత్రి బుచ్చిరాజు అసలు ఇంటికి రానేలేదని తెలిసినా, చీమ కుట్టినట్టన్నా వుండేది కాదు కాంతానికి.

కానీ, ఒక రోజు — చీకటి పడ్డాక నీళ్ళు పోసుకుని, చాకలి తెచ్చిన చీర కట్టుకుని — మిద్దిగదిలో పెట్టెల చాటున అలంకారానికి కూర్చుంది కాంతం.

పెళ్ళయ్యాక కాంతానికో మేదర బొట్టుపెట్టి ఏర్పాటయింది. అందులో ఒక చెక్క దువ్వెనా, అర చెయ్యంత అద్దం, తలచిక్కు తీసుకునే చిక్కట్టూ, కాటుక డబ్బీ, చిన్న వేసలైను బుడ్డీ, పునుగు సీసా, కొత్త పౌడరు డబ్బా వుండేవి. అన్నిటి కన్నా బాగా ఖరీదైంది — రెండు తులాల వెండి కుంకంకాయ.

అవన్నీ కాంతానికి స్వంతం. రోజూ చీకటి పడ్డాక నీళ్ళు పోసుకుని, తలనున్నగా దువ్వుకుని, అరి చేతుల్లో తెల్లటి పౌడరు ఒంపుకుని అపురూపంగా మొహానికి రాసుకుని, పిసరంత పునుగు వేలితో గుడ్డలకి రాసుకుని, వెండి కుంకంకాయ తీసి బొట్టు పెట్టుకుని, అన్నీ బొట్టు పెట్టలో సర్దేసి, గట్టిగా మూత అణచేసి, బొట్టుపెట్టిని జాగ్రత్తగా మసిలి మీద పెట్టేస్తుంది. మళ్ళీ మర్నాడు రాత్రి నీళ్ళు పోసుకున్నాకే దాన్ని ముట్టుకోటం.

పెళ్ళయింతర్వాత సాయంత్రం పూట ముస్తాబు చేసుకుని పొగ్గా తయారవటం కాంతానికి బాగానే వుండేది.

"అప్పా, నీ కోక ఎంత బాగా వాసనొస్తందే!" అంటూ చెల్లెళ్ళూ తన చుట్టూ చేరితే కాంతానికెంతో సిగ్గు ముంచుకొచ్చేసేది.

ఆ రోజేం జరిగిందంటే — ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ కాంతం తల నున్నగా దువ్వుకుని గట్టిగా కర్రలా జడ అల్లుకుని చివర పూలు ముక్క కుచ్చు పెట్టుకుంది. పౌడరు మొహం నిండా రాసుకుంది. బేసరు కొమ్మ కిందికి ఒంగిపోతే సరిగా సర్దుకుంది. వేలికి పునుగు అంటించుకుని చీరకి అక్కడక్కడా పులుముకుంది. కళ్ళకి కాటుక వెడల్పుగా పెట్టుకుంది .... కుంకం కాయ తీయ బోయింది. కనిపించలేదు! గబగబా వెతికింది. కంగారుకొద్దీ బొట్టు పెట్టంతా కింద గుమ్మరించింది. బొట్టు పెట్టిని అలా బోర్లా పెట్టకూడదు. కాంతానికి తెలుసుగానీ కంగారులో అలాగే చేసింది. ఎంత సేపు వెతికినా వెండి కుంకం కాయ లేనే లేదు .... పోయిందా? అమ్మో! ఎలా పోయింది? ఎండిది కూడా? నిజంగా పోయిందా? ఇంకెక్కడుంది? — అప్పుడే కాంతానికి కళ్ళు పూడుకు వచ్చేశాయి.

గబగబా వసారాలోకి పరిగెత్తింది. మంగమ్మ చిన్నపిల్లలకి అన్నాలు పెడుతోంది.

"అమ్మా! నా బొట్టు పెట్టెలో కుంకం కాయలేదే?"

"ఎందుకుండదూ? ఎక్కడ పడేశావో! సూడు సరిగ్గా"

"సూశానే. అంత సూశా! ఎక్కడా లేదు!"

"నిజంగానే? ఎందిడే?" కంగారు పడింది మంగమ్మ.

"అదేనే! బొట్టెట్టుకుందామని సూశాను. ఎంత ఎతికినా కనపట్టం లేదు."

"సరిగ్గా దాశావో లేదో మతిమరుపు ముండా! నీతో రోజుకొక గోల .... ఎక్కడ పడేశావో సరిగా సూడే!" అంటూ అరిచింది మంగమ్మ.

కాంతం బిక్క చచ్చిపోయింది. "బొట్టు పెట్టిలోనే పెట్టానే."

"అమ్మా! అప్ప బొట్టుపెట్టి ఇందాక మావయ్య తీశాడే!" ఉత్సాహంగా చెప్పేశాడు శివరావు.

"ఎప్పుడ్రా? ఆడెందుకు తీశాడూ?"

"నిజంగానేనే. ఎవ్వరికీ చెప్పొద్దని నాకో అణా కూడా ఇచ్చాడే! నేను జీళ్ళు కొనేసుకున్నా."

కిక్కురుమనలేదు మంగమ్మ. కాంతం ఏడుపు మొహంలో నెమ్మదిగా అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

బొట్టు పెట్టుకోనే లేదు .... అసలు ఎప్పుడూ బొట్టు పెట్టుకోకూడదనిపించింది కాంతానికి, ఆ పూట!

ఎంత చక్కటి కుంకం కాయ! మూత మీద సింహం తలా, చుట్టూ చక్కగా ఆకులూ పువ్వులూ, నిండా ఎర్రకుంకం వుంది. వెండిది కూడాను. చెక్కదా, ఇత్తడిదా? ఎండిది!" కాంతానికి ఎంత ఏడుపు ఆపుకున్నా ఆగలేదు.

పెళ్ళాం వస్తువు మొగుడే ఎత్తుకుపోతే ఎలాగ? రేపు పవుడరు డబ్బా .... ఎల్లుండ పునుగు సీసా .... అవన్నీ మాత్రం వుంచుతాడా? బొట్టు పెట్టి ఇంకెక్కడ పెట్టుకోవాలి?

అందరూ తిళ్ళుతిని మణిగే వేళకి వచ్చాడు, కొత్తల్లుడు బుచ్చిరాజు. అప్ప వడ్డిస్తే తిని లేచాడు.

అప్ప కుంకంకాయి మాట ఎత్తకుండా వూరుకుంది.

కాంతం మాత్రం కోపం ప్రదర్శించటానికి నేల మీద, చెయ్యి తలకింద పెట్టుకుని పడుకుంది.

"అదేంటే, కింద పడుకున్నావూ?" అంటూ చెయ్యి పట్టుకుని లాగాడు.

మొగుడి చేతిని విసిరి కొట్టింది.

"ఏంటే, కోపం జాస్తీగా వుందే! ఏంటైంది?"

కాంతానికి కోపం ఆగలేదు. లేచి కూర్చుని "నా ఎండి కుంకంకాయ తీసుకుపోయావు కదా?" అంది కోపంగా.

"ఛీ, నేనా? ఎవరన్నారు?"

"మా శివుడు చెప్పాళ్ళే. ఆడికో అణా కూడా ఇచ్చావంటగా?"

"ఏడిశాడు, దొంగ ఎదవ! ఆడే తీశాడేమో! నేను మాత్రం తియ్యలేదే! నీ మీదొట్టు. అదెలా పోయిందో నాకు తెలవదు. పోతే పోయిందిలే. ఇంకోటి చేయిస్తాలే. పంటలు రానీ!"

"ఛీ, నాకేం అక్కర్లేదు. నా కుంకుంకాయ ఎత్తుకుపోయి ఒట్టుకూడా పెడుతున్నావు" అంటూ కాంతం బావురుమంది.

"ఎందుకే ఆ ఏడుపూ?" అని ఖయ్యిమన్నాడు బుచ్చిరాజు.

అయినా కాంతం ఏడుపు ఆగలేదు. వెక్కివెక్కి ఏడుస్తూనే పడుకుంది అర్ధరాత్రి దాకా.

"అప్పా! ఇది చూడే! ఎలా సోకాలెడతందో!"

తమ్ముడి ఫిర్యాదు విన్న మంగమ్మ, మొగుడు తొందరగా రానందుకు కూతురు శోకాలెడతంది గావాల అనుకుంది. నులక మంచంలోంచి లేచి వచ్చి తలుపు దగ్గిర తొంగి చూసింది — "ఎందుకే ఎదవ ఏడుపు, నోరు మూసుకోక? ఆడికేం మొగ మారాజు. మడి కట్టుక్కూర్చుంటాడనుకున్నావా? .... మళ్ళీ నోరెత్తిందంటే రెండు అంటించరా బుచ్చీ!" అనేసి అక్కణ్ణించి పోయింది.

కాంతం ఏడుపు మానలేదు. మొగుడు ఎవతి దగ్గరకో పోయాడని కాదు కాంతం ఏడుపు.

ఉత్త పుణ్యానికే ఎవతికేసో చూశాడని అయ్యని నానా తిట్లూ తిట్టిపోసే అమ్మ తనకి నీతులు చెప్పడం చూస్తే మరీ ఏడుపొచ్చింది.

నిద్రలో కూడా ఏడుస్తూనే వుంది ఆ రాత్రి.

★ ★ ★

కన్నీళ్ళతో ప్రారంభమైన కాంతం కాపరం. కంటి తడి ఆరకుండానే నాలుగేళ్ళు గడిచాయి.

"అప్ప కాళ్ళాయేళ్ళా బడి ఏడిసిందని నిన్ను కట్టుకున్నాగానీ, లేకపోతే ఎంతో అందమైన దాన్ని .... రంభలాంటి దాన్ని .... వెయ్యి రూపాయలైనా కట్నం తీసుకుని పెళ్ళి చేసుకునే వోణ్ణే. సిగ్గు లేక ఇంకా నీలుగుతావెందుకే ఎదవ ముండా!" అని బుచ్చిరాజు రోజూ ఎప్పుడో అప్పుడు తన త్యాగం గురించి కాంతం ముందు ప్రకటించి తిట్టిపోస్తూనే వుండేవాడు.

మొగుడు ఎప్పుడన్నా నవ్వుతూ మాట్లాడినా బిగుసుకు పోయేది కాంతం. వేళాకోళం ఆడినా చిన్నబుచ్చుకునేది.

పెళ్ళయ్యాక నాలుగో యేట కాంతానికి కొడుకు పుట్టాడు. అప్పటి నించీ కాంతానికి కొత్త జీవితంలాగ అనిపించేది. మొగుడి దగ్గర కూడా కాస్త ధైర్యంగా తిరగటం నేర్చుకుంది.

కొడుకు పుట్టాక కూడా తండ్రిలో ఏ మార్పు రాలేదు.

రామం, తల్లిలా నలుపే అయినా ఎత్తు పళ్ళు రాలేదు. కొడుక్కి తల్లి దగ్గరే బాగా చనువు. తండ్రితో సంబంధమే వుండేది కాదు.

కొడుకు రెండో క్లాసు చదువుతున్న రోజుల్లో ఉన్నట్టుండి బుచ్చిరాజు జబ్బు పడ్డాడు. ఒకరోజు చలి చలిగా ముణగదీసుకుని పడుకున్నాడు. అదేం తెగులో పెద్దపెట్టున ముంచుకొచ్చింది. మందుల వీర్రాజు ఇచ్చే కషాయాలు మింగుతూ, ఆస్పత్రికి వెళ్ళటానికి వెనకా ముందూ ఆడాడు.

కాంతం నిద్రా నిప్పులూ లేకుండా చాకిరీ చేసింది. కాళ్ళూ చేతులూ పట్టేది. కషాయాలూ జావలూ కాచేది. మందులూ మాత్రలూ మింగించేది. ఒంటిమీద ఈగ వాలకుండా విసుర్తూ కూర్చునేది. ఎన్ని చేసినా బుచ్చిరాజు రంకెలేస్తూనే వుండే వాడు. "అయిగా వండుకు తిన్నావుగా? నేను బాధతో ఛస్తున్నానే ముండా! ముండ మోస్తేగానీ నీకు బుద్ధి రాదులే. కాళ్ళు లాక్కుపోతన్నాయి. గట్టిగా నొక్కవే, గిన్నెడూ మింగావుగా? సత్తువ

లేదా? ఎవడికి ధారపోశావే?" అంటూ ఎప్పుడూ గంగిర్లెత్తిన వాడిలా తిట్టిపోస్తూనే వుండేవాడు.

"ముండా! నువ్వు మంచిదానివైతే నాకీ రోగం రాకపోనే!" అన్నాడొకసారి.

కాంతం తెల్లబోయింది. మొగుడెందుకలా తిట్టాడో ఎప్పటికీ అర్థం కానేలేదు కాంతానికి.

చివరి రోజుల్లో గొడ్డులా బాధపడి, యమయాతన అనుభవించి, కుళ్ళికుళ్ళి చచ్చాడు — బుచ్చిరాజు.

మొగుడు మంచంమీద వున్నప్పుడు ఆ బాధ చూడలేక ఒళ్ళు దాచుకోకుండానే చాకిరీ చేసింది గానీ .... మొగుడు చచ్చిపోయాక ఏడుపే రాలేదు కాంతానికి. మొగుడి శవాన్ని చూస్తోన్నా, ఆ మనిషి గడ్డి మీద కట్టెలా పడివున్నా, అతను నిజంగా చచ్చిపోయాడన్న నమ్మకమే కలగలేదు కాంతానికి. హఠాత్తుగా లేస్తాడనీ, "కాళ్ళు నొక్కవే ముండా! సత్తవ లేదా? తింటం లేదా?" అంటాడనీ అనిపించేది. శవాన్ని ఎత్తినప్పుడే కొంచెం నమ్మకం కలిగింది, నిజంగానే పోయాడేమో అని!

తమ్ముడి చావు కబురు విని దారేపోయే ఎడ్ల బండిలో వచ్చింది మంగప్ప. ఎడ్ల బండిలోంచే "ఓరి తమ్ముడో, నా బిడ్డని దగా చేశావా? నా కడుపులో చిచ్చు పెట్టావా? నీ దారి నువ్వు చూసుకున్నావా? అప్పుడే నూరేళ్ళూ నిండిపోయాయా? తమ్ముడో .... తమ్ముడో .... బుచ్చిరాజో!" అంటూ పెడబొబ్బలు పెట్టి ఏడుస్తూ బండి దిగి కూతుర్ని వాటేసుకుంది.

అప్పటికీ కాంతానికేం ఏడుపు రాలేదు. తనకి కొత్తగా ఏం ఆపద ముంచుకొచ్చిందో, ఇన్నాళ్లూ తన కోసం వున్న వాళ్ళెవరు ఇప్పుడు లేకుండా పోయారో, కాంతానికి అర్థమే కాలేదు.

ఏడవకుండా 'మొద్దులా' కూర్చున్న కాంతాన్ని మంగమ్మ కొరకొరా చూసి ముక్కు చీదేసింది. తల్లి చూపుకి హడిలిపోయిన కాంతం .... కాస్సేపు తల్లితో జతగా "ఊఁ, ఊఁ" అంటూ చిన్న పిల్లలు ఏడ్చినట్టు రాగం తీసింది. కాస్సేపటికి అదీ చేతకాక మానేసింది.

బుచ్చిరాజుకి దినాలూ, వారాలూ అయ్యాయి.

మంగమ్మ కూతుర్ని పూటపూటా ఓదారుస్తూనే వుంది. "ఇక నీకిక్కడేంవుందే కాంతం? ఆ కుర్ర నాగమ్మని తీసుకుని నాతో వచ్చెయ్యి! అక్కడే పడి వుందాం. కలోగంజో కలిసే తాగుదాం" అనడం సాగించింది.

మొగుడు చచ్చిన్నాటి నుంచే కాంతం బుర్ర కాస్త స్వతంత్రంగా పనిచెయ్యటం మొదలెట్టింది. అప్పుల కింద ఎంత పోయినా రెండెకరాల పొలం మిగులుతుందని కరణం చెప్పాడు. వుండటానికింత కొంప వుంది. వండుకు తింటానికి గిన్నీ ముంతా వున్నాయి. కొడుకు అప్పుడే రెండో క్లాసు చదువుతున్నాడు.

పుట్టింట్లో శివరావు, మేనమావఁకన్నా అధ్వాన్నంగా తయారయ్యే రకంలా ఉన్నాడు. తల్లికీ తండ్రికీ తన్నులు తగలని రోజు వుండడం లేదు. అలాంటి మేనమావఁ చేతుల్లో తన కొడుకుని పెట్టి, రెండెకరాల చెక్కనీ అప్పగిస్తే .... తన పొట్లు కుక్కలక్కూడా రావని కాంతం బాగానే గ్రహించుకుంది.

"ఏంటే, అలా కూచున్నావు కాంతం? లేచి సామానదీ సర్దుకో. బండి కట్టించుకు పోదాం. పోయిన వాళ్ళతో పోతామా? దయిర్యం తెచ్చుకో" అంది కన్నతల్లి మళ్ళీ.

కాంతం, కంఠం పెగిలించుకుని అప్పటికి తేల్చి చెప్పేసింది. "నేను ఎక్కడికీ రానే అమ్మా! కుర్రోణ్ణి పెట్టుకుని ఇక్కడ వుంటా. పొలం పని చేసుకుంటా."

తల్లి ఉరిమి చూసింది. కూతురి తెలివికి ఆశ్చర్యపడింది — "అదేంటే కాంతం? పుట్టింటోళ్ళంతా చచ్చారనుకున్నావా? కుర్ర సన్నాసిని పెట్టుకుని ఒక్కదానివీ వుంటావా? వయసులో వున్న పిల్లవి. మొగెదవలు నిలవనిస్తారా? కాలునొచ్చినా చెయ్యి నొచ్చినా, ఒకళ్ళకి సాయంగా ఒకళ్ళం పడి వుందాం. నాతో రామ్మా!" అని చాలా మెత్తమెత్తగా చెప్పింది తల్లి.

ససేమిరా కాంతం ఒప్పుకోలేదు — "నాకేం లోటే అమ్మా! నోరు మంచిదైతే ఊరు మంచిదంటారు. నా వేపెవడు చూస్తాడే? నేనేవన్నా అందగత్తెనా, రంభనా? నా ఎత్తు పళ్ళే నాకు అండలే. బుచ్చి మావయ్య వున్నప్పుడు మాత్రం నేను ఒక్క దాన్నే కదా వున్నాను? అలాగే వుంటాను. ఎలాగో ఒబ్బడిగా గడుపుకుంటాను."

కూతురి గడుసుదనానికి మంగమ్మకి చివాలెత్తాయి — "నీ వుద్దేశం ఏంటో వుందిలే. ఊరొదిలి ఎందుకు రానంటున్నావో నాకూ తెలుసులే. మొగు

డెలాగా చచ్చాడని .... తెయ్‌తక్క లాడక కాస్త పరువూ మర్యాదా నిలబెట్టుకో. 'మంగమ్మ కూతుర్న'ని పించుకో" అంటూ రంకెలేస్తూ బండెక్కింది.

మొగుడి చెరా, తల్లి చెరా అన్నీ వొదిలి, కాంతానికి అప్పటి నించే నిజంగా స్వతంత్రం ప్రారంభమైంది.

★ ★ ★

కాంతానికి ఇరవయ్యేళ్ళ వయసులోనే అరవ య్యేళ్ళు మీద పడ్డాయి.

తెల్ల సైనుపంచీ, ముచ్చిన గుంటన ముడీ, చేతు లకీ రెండేసి ఇత్తడి గాజులూ — అదే కాంతం రూపం ఏనాటినించో. మొగుడు పోయిన దగ్గిర్నించీ కాంతానికి ఏడేళ్ళ కొడుకు తప్ప ఇంకెవ్వరూ లేరు. ఆ కొడుకుని కనటానికే దేవుడు తనని పుట్టించాడు అనుకునేది. కొడుకుని పెంచి పెద్ద చెయ్యటానికే తనకి ఆరోగ్యం, ఆయుష్షూ ఇచ్చాడు. తన బతుక్కి సార్థకత ఆ కొడుకుని పెంచటం ఒక్కటే. ఇవ్వాళ తను తన బిడ్డని పెంచితే, రేపు వాడే తనని చూసుకుంటాడు.

కొత్తగా తెల్లగుడ్డలు కట్టుకుంటున్న తల్లిని చూసి రామం ఏదో భూతాన్ని చూసినట్టు భయపడే వాడు మొదట్లో. నెమ్మదిగా ఆ భూతానికే అలవాటు పడ్డాడు.

రోజు సాయంత్రం బళ్ళోంచి రాగానే గడపలోకి పుస్తకాల సంచీ గిరాటు పెట్టి చింతచెట్టు కిందకి పరిగెత్తుకు పోయేవాడు.

"నాయనా! రామన్నా! ఏదన్నా తిని పోరా!" అని తల్లి వెంటపడేది.

పిల్లాడికోసం రోజూ ఉప్పుడు పిండో, రొట్టి ముక్కో, గుగ్గిళ్ళో, అటుకులో, పేలాల పిండో, ఏదో ఒకటి సిద్ధం చేసేది.

తల్లి కేకలకి చింతచెట్టు దగ్గిర్నించి పరిగెత్తుకొచ్చి "మంచినీళ్ళు తాగరా నాయనా!" అంటున్నా విన్పించు కోకుండా మళ్ళీ చింతచెట్టు దగ్గిరికి పరిగెత్తే వాడు.

పిల్లాడు వచ్చే లోపల తల్లి పొయ్యి అంటించి చితుకులు మంటపెడుతూ బియ్యం పొంగించేది. పొయ్యి మీద నీళ్ళు పడేసేది. పిల్లాడు వచ్చేదాకా గిన్నీ ముంతా తోముకుంటూ, ఇల్లూ వాకిలీ ఊడ్చు కుంటూ, తట్టా బుట్టా సర్దుకుంటూ, ఉప్పూ పప్పూ బాగు చేసుకుంటూ, చిరుగులు పట్టిన గుడ్డలు కుట్టు కుంటూ, ఎలాగో కాలక్షేపం చేసేది. చేతుల్లో పని చేతుల్లో వుండగానే వీధి గడపలో తచ్చిళ్ళాడుతూ, చీకటి పడితే కోడిగుడ్డు బుడ్డి వెలిగించి కొడుకు కోసం కాచి పెట్టుకు కూర్చునేది.

రామం చెమటలు కక్కుకుంటూ వచ్చేవాడు — "అమ్మా; ఆకలే" అంటూ.

తల్లి గబగబా పొంతకుండ దొడ్లో పడేసేది. సున్ని పిండితో కొడుక్కి ఒళ్ళంతా తోమి తోమి నీళ్ళు పోసేది. తడి ఒంటితో కొడుకుని చంకనేసుకుని — "నడవకు ... అరికాళ్ళకి బాడి అవుతుంది బాబూ!" అంటూ ఇంట్లోకి తీసుకుపోయి నించోబెట్టి పమిటితో ఒళ్ళంతా తుడిచేది. తర్వాత పెద్ద పీట వేసి అన్నానికి కూర్చో బెట్టేది.

"అమ్మా! ఇది అయ్య పీటేనా?" అనేవాడు పిల్లాడు పూటపూటా.

కొడుక్కి ఆ పీటమీద కూర్చున్నప్పుడు మాత్రం తండ్రి జ్ఞాపకం వచ్చేవాడు. పీటని రెండు చేతులతోటి తడుముతూ "అయ్య పీట, అయ్య పీట" అనేవాడు.

అప్పుడు మాత్రం కాంతానికి గుండెలు బరు వెక్కేవి. "అయ్యో! నా బిడ్డకి తండ్రి లేకపోయాడు కదా? ఆరేళ్ళనాడే అనాథుడై పోయాడే కొడుకు. తండ్రి వుంటే ఆ దారి వేరు" అనుకుంటూ దిగాలుపడి పోయేది.

కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ కొడుకుతో అనేది — "ఆఁ, మీ అయ్య పీటే. నీ ముద్దు ముచ్చట్లు చూసు కునే అదృష్టం లేకపోయింది అయ్యకి. ఇంక ఇంట్లో మొగదిక్కెవరున్నారు? నువ్వే మొగదిక్కు నాకు."

పూట పూటా అవే మాటలు!

కొడుక్కి ఇంకా ఏదో చెప్పాలని, తన బతుకంతా చెప్పాలని వుండేది కాంతమ్మకి. అప్పుడప్పుడూ మాటల మధ్య అనేది — "అమ్మా అయ్యా ఆదరించ లేదురా, కట్టుకున్న వాడు కనికరించలేదురా, అయితే యేంలే, దేవుడు నిన్నిచ్చాడు నాకు. అంతకన్నా ఏం కావాలి నాకు?" అనేది.

పిల్లాడికేమీ అర్థం కాకపోయినా వింతగా చూసి నవ్వేవాడు.

కంచుగిన్నెలో వేడివేడి అన్నం పెట్టి, చింతకాయ పచ్చడో, ఉసిరికాయ పచ్చడో వేసి, నేతి బొట్టువేసి,

చక్కగా కలిపి ముద్దలుపెట్టేది.

"అమ్మా! ఇంక వొద్దే."

"అయ్యో, అప్పుడేనా? ఈ ముద్ద కూడా తినె య్యాలి."

తల్లి అలాగ బతిమాలి బతిమాలి ముద్దలు పెట్టడం పిల్లాడికి ఇష్టమే. ముద్ద ముద్దకీ తల తిప్పేస్తూ, తల్లిని విసిగిస్తూ, నవ్వుతూ ముద్దలన్నీ మింగుతాడు. చివరికి, చిట్టి మట్టి పిడతలో తోడు పెట్టిన గడ్డపెరుగంతా పిల్లాడి పళ్ళెంలోకి ఒంపు తుంది.

"అమ్మా! నీకో?" అనేవాడు అప్పుడు మాత్రం.

తల్లి కడుపు ఆనంద సముద్రం అయిపోయేది. "పర్వాలేదమ్మా! నాకు చల్ల వుందిలే. నువ్వు కడుపునిండా తిను" అనేది.

పిల్లాడు ఆబగా పెరుగు ముద్దలన్నీ తినేసే వాడు.

కొడుక్కి కూరి కూరి తినిపించి, చేతులూ మూతులూ కడిగి, చాపలేసి పుస్తకాల సంచి తెచ్చి అక్కడ పెట్టేది.

తను గిన్నినిండా అన్నం పెట్టుకుని గడప దగ్గిర తింటూ కూర్చునేది.

నిద్రమత్తుతో జోగుతున్న కొడుకు — "అది నా కన్ను. నా కన్ను అక్కడ ఉన్నది. అది నా ముక్కు. నా ముక్కు అక్కడ ఉన్నది" అంటూ చదువుకు పోతోంటే కొడుకు విద్వత్తుకి ఆశ్చర్యపడిపోతూ, పరమా నందంగా వింటూ, దూరదూరంగా ఆలోచనలు చేస్తూ వుండిపోయేది — పంతులు గారికో రూపాయి డబ్బులు ఇచ్చయినా సరే రామన్నకి బాగా చదువు చెప్పించాలి. ఇప్పుడు రొండు చదువుతున్నాడు. వొచ్చే యేడు మూడు చదువుతాడు. మరుసటేడు నాలుగూ. పదేళ్ళు కళ్ళు మూసుకుంటే చదువంతా అయి పోతుంది.

చిట్టచివర్న ఏ బియ్యే పరీక్షో చదువుతాడు. రామన్న అంతటోటే — తల్లి ఆలోచనలు అలా సాగుతూ పోయేవి.

★ ★ ★

కాంతమ్మ, భారమంతా ఏడుకొండల వెంక టేశ్వరుడి మీదే పెట్టి, కొడుకుని సాకుతూ వచ్చింది, నోరూ వాయీలేని ఒక ఆడది, పసి బిడ్డణ్ణీ పెట్టుకుని ఒంటరిగా బతకటానికి ఎన్ని యాతనలు పడాలో అన్నీ అనుభవించింది కాంతమ్మ.

రామం పెద్దవుతోన్న కొద్దీ తల్లికి దూరమే అయ్యాడు. ఫస్టు ఫారం చదవటానికి హైస్కూలుకి పోయిన్నాడే తల్లి ఒడి మర్చిపోయాడు. పుస్తకాలూ — బడీ — స్నేహితులూ — చదువూ అతని ప్రపంచం అయ్యాయి.

కాలం గిర్రున తిరిగినట్టే తోచింది కాంతమ్మకి. కొడుకు పాతికేళ్ళ వాడయ్యాడు. పెద్ద చదువే చదివాడు. ఉద్యోగం సంపాదించుకున్నాడు.

అప్పటికి భూమి పూర్తిగా హరించింది. కాంతమ్మకి భర్త ఇచ్చిన భూమితో బంధం తీరిపోయింది.

కన్న తల్లితో బంధం కూడా తీరిపోయింది. మంగమ్మ, చివరికాలంలో జబ్బుపడి, కొడుకు వొది లేస్తే, చిన్న కూతుళ్ళు పట్టించుకోకపోతే, పెద్ద కూతురి కొంపకే చేరి ఆర్నెల్లపాటు మంచం మీదే గడిపింది. తల్లిని కాంతం శ్రద్ధగానే చూసుకుంది. రాత్రింబవళ్ళూ చాకిరీలు చేసి తల్లి రుణం తీర్చుకుంది.

తల్లి పోయిన్నాడు కాంతమ్మకి ఏడుపు రాలేదు. "అయ్యో, అమ్మ లేదు కదా?" అనిపించింది. అంత కన్నా కళ్ళు చెమర్చలేదు. "పుట్టిన వాళ్ళు గిట్టవలసిందే కదా? అంతా ఏడు కొండలవాడి దయ" అని మాత్రం అనుకుంది.

కాంతమ్మ కొడుకు, తల్లిని తీసుకుని ఉద్యోగం చేసే ఊరికి వెళ్ళిపోయాడు.

తనకిష్టమైన పిల్ల సంగతి చెప్పి, పిల్లని పెళ్ళి చేసుకుంటానని కొడుకు అన్నప్పుడు కాంతమ్మ చాలా ముచ్చటపడింది. సంతోషించింది.

కాంతమ్మ కళ్ళకి — కోడలు అందాల భరిణి. దంతం బొమ్మ. సన్నజాజి పువ్వు! "ఆడపుటక పుట్టాక అందం చందం వుండాలి...." అనుకుంటూ కోడల్ని కన్నార్పకుండా చూస్తూ వుంటుంది. అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టు "అయ్యో, పిల్లకి దిస్టి తగిలేను" అని కళ్ళు తిప్పుకుంటుంది.

కొడుకు బతుకు పండు వెన్నెల్లా అయిందని కాంతమ్మకి పుట్టెడు సంతోషం.

ఏనాటి నించో పుట్టింటికి తొంగి చూడలేదు. చెల్లెళ్ళంతా ఎక్కడున్నారో కూడా సరిగ్గా తెలీదు. తమ్ముడు ఒక్కసారన్నా పిల్చుకు పోలేదు. దేన్నీ పట్టించుకోలేదు కాంతమ్మ. తన ఇల్లే సర్వం. తన కొడుకూ కోడలూ దేవతలు. వాళ్ళ అందచందాలు చూసుకుంట, వాళ్ళకి పూటపూటా వండిపెడుతూ సదుపాయాలు చేస్తూ, రోజూ ఏడుకొండల వాడి పటానికి దణ్ణం పెట్టుకుంటూ .... అదే కాంతమ్మ జీవితం! బతికి బాగుంటే, ఎప్పుడన్నా ఒక్కసారి ఏడుకొండల వాడి దర్శనం చేసుకుంటే .... చాలు, చాలు! ఇక నిశ్చింతగా కళ్ళు మూసెయ్యవచ్చు — అనుకుంటూ వుంటుంది.

★ ★ ★

కాంతమ్మ గడపలో కూలబడ్డది కూలబడ్డట్టే వుంది. పక్కన, తిరపతి వెళ్ళి రావలసిన చేతి సంచి పడి వుంది.

బైట చినుకులు పడుతూనే వున్నాయి.

నాగరత్నం పూలుకోసుకుందామని వీధి వాకిట్లోకి వచ్చింది. తలుపులు బార్లాతీసి వుండడం చూసి తెల్లబోతూ గుమ్మంలోకి తొంగి చూసింది.

కాంతమ్మ మూటలాగ పడి వుంది గడప దగ్గిర.

నాగరత్నం హడలి పోయింది. ఒక్క క్షణం తటపటాయించి లోపలికి అడుగుపెట్టింది. "పెద్దమ్మా! ఇదేమిటీ? నువ్వు వెళ్ళలేదూ? ఇందాకటి నించీ నేనిటు చూడనే లేదు. పెద్దమ్మా! తిరపతి వెళ్ళలేదూ?" అని పెద్దమ్మని కదిపి కదిపి పలకరించింది.

కాంతమ్మ కళ్ళు తెరిచింది. నాగరత్నం వేపు కొత్త మనిషిని చూసినట్టు చూసింది. "మా రామన్న లేడు. బళ్ళోకి వెళ్ళాడు."

తెల్లబోయింది నాగరత్నం — "నువ్వు తిరపతి వెళ్తానన్నావుగా పెద్దమ్మా?"

"కుఱ్ఱ సన్నాసి. వాడికేం తెలుసమ్మా! వాన బాగా కురిసిందా? ఆఁ, అయితే బాగా తడిసిపోతాడు. కాసిన్ని నీళ్ళు కాగబెడతాను. రాగానే నీళ్ళు పోస్తాను".

నాగరత్నానికేం అంతుపట్టలేదు. ధైర్యం చిక్కపట్టుకుని కాంతమ్మ ఒంటిమీద చెయ్యి పెట్టి చూసింది. ఒళ్ళంతా మాడిపోతోంది. "పెద్దమ్మా! నీకు బాగా జ్వరం వచ్చినట్టుంది. పరాగ్గా మాట్లాడుతున్నావు. లేచి మంచం మీద పడుకో" అంటూ నాగరత్నం గబగబా మంచం వాల్చింది. దుప్పటి పరిచింది. కాంతమ్మని లేవదీసి పడుకోబెట్టింది.

కాంతమ్మ పడుకున్నట్టే పడుకుని దిగ్గున లేచి పోయింది — "అయ్యో! నా కొడుకు వస్తాడమ్మా! బళ్ళోంచి. రాగానే పుస్తకాలక్కడ పారేసి 'అమ్మా, యావన్నా పెట్టు' అంటాడు. పడుకుంటే ఎలాగ? కొంచెం ఉప్పుడు పిండన్నా చేస్తాను" అంటూ వూడిపోయిన జుట్టూ దులిపి ముడేసుకుంది. జారిపోతున్న పంచిగట్టిగా కట్టుకుంది.

ఆశ్చర్యంగా చూస్తూ నిలబడింది నాగరత్నం.

వీధిలో రిక్షా ఆగింది.

కాంతమ్మ కొడుకూ కోడలూ దిగారు.

రిక్షా మనిషి సామాను తెచ్చి గడప దగ్గిర పెట్టి వెళ్ళిపోయాడు.

గీత రుసరుసలాడుతూ వాల్చివున్న మంచం మీద కూర్చుంది.

నాగరత్నం తెల్లబోతూ అడిగింది — "మీరిద్దరే వెళ్ళారా? ఏవైంది? బండి అందలేదా?"

"పైనెక్కడో రైలుకట్ట పాడైందట! రేపటి దాకా అటువేపు రైళ్ళు వెళ్ళవట!" అని చెప్పడానికి సిగ్గుపడుతున్నట్టే చెప్పాడు రాము.

కాంతమ్మ, పంచెకొంగు భుజం మీంచి జారి నేల మీద పారాడుతోంటే వంటింటి గుమ్మం దగ్గిరికి వెళ్ళి పెరటి తలుపులు తీసింది. కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకుంటూ చీకట్లో కాకర పాదుకేసి చూసింది — "నాయనా రామన్నా! వానలో జామచెట్టెక్కావా? జొరం వస్తుందిరా తండ్రీ! అయ్యో, అయ్యో! కాలు జారి పడిపోతావురా! దిగరా నాయనా! ఏదన్నా పెడతాను. నా బాబువి కదూ? దిగి రారా రావుఁడూ!" అంటూ ప్రాధేయపడుతూ నిలబడింది — "కుఱ్ఱసన్నాసి. మాట వినడమ్మా! ఊహూ వినడు" అంటూ గొణుక్కుంటూ ఇవతలికి వచ్చింది.

రామం తెల్లబోతూ నాగరత్నం వేపు చూస్తూ "అక్కయ్యా! అమ్మ అలా మాట్లాడుతోందేంటీ?" అన్నాడు.

"నాకూ తెలీదు రామం. ఇప్పుడే వచ్చాను నేను.

అసలు మీరందరూ వెళ్ళిపోయారనుకున్నాను" అంటూ నాగరత్నం గబగబా చెప్పుకొచ్చింది. "పనంతా అయ్యాక పువ్వులు కోసుకుందామని మీ వాకిట్లో కొచ్చాను. తలుపులు తెరిచి వున్నట్టు కనపడితే మీరింకా వెళ్ళలేదా అని లోపలికి చూశాను. పెద్దమ్మ పడిపోయి వుంది. గబగబా మంచం వాల్చి పడుకో బెట్టాను. కాస్సేపు పడుకుని లేచిపోయింది. 'రావుడూ, నాయనా, నాయనా' అని ఇటూ అటూ తిరుగుతోంది. నన్ను పోల్చనే లేదు. 'మా రావుడు బళ్ళోకి వెళ్ళాడమ్మా' అంటోంది. 'వానలో తడిసిపోయి వస్తాడు. నీళ్ళు కాగ బెట్టాలి' అంటోంది. ఇదుగో, ఇప్పుడే అటు వెళ్ళింది. అంతలో మీరొచ్చారు..." చెప్తోంటే నాగరత్నానికి ఏడుపు వచ్చేసింది — "పెద్దమ్మకి జ్వరం బాగా వొచ్చింది రామం" అంది చివరికి.

అంతవరకూ విచిత్రంగా చూస్తోన్న కాంతమ్మ మొహమంతా సంతోషం వెలిగింది. "ఎవరూ? మా రామన్న కోసమా? కూర్చోండి. కూర్చోండి బాబూ! ఇప్పుడే బళ్ళోకి వెళ్ళాడు. పంతులుగారు తీసికెళ్ళారు. వచ్చేస్తాడు. అన్నం తిన్నాడే కాదు" అంటూ రెండడు గులు ముందుకు వచ్చింది.

అంతలోనే మళ్ళీ గబగబా పెరటికేసి వెళ్ళింది — "నాయనా, రామన్నా! నీళ్ళు పోసుకుంటున్నావా? వుండు, వుండు, వీపు తోముతాను. ఎంత సేపలా నీళ్ళలో కొట్టుకుంటావూ? రొంప పడుతుంది. అసలే నీ వొళ్ళు మంచిది కాదు. ఇక చాల్లే, వొళ్ళు తుడుస్తాను రా!" అంటూ కేకలుపెట్టింది.

వసారాలో పీట వాల్చి పళ్ళెం పెట్టింది. చెంబు పెట్టింది. తను ఖాళీ పళ్ళెం ముందు కూర్చుంది "నా మాట వినరా! గమ్మున రారా రావుడూ! నీ కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నానురా" అంటూ నేలమీద చేతులు ఆన్చి లేచింది.

"వెర్రి నాగన్న! మాట వినటం మానేశాడు" అంటూ గొణుక్కొంది. "నాయనా! నన్నిలా ఏడిపించ కురా! బాగా చదువుకోవాలి. చుక్కలాంటి పిల్లని పెళ్ళి చేసుకోవాలి, తెలిసిందా? ముందు తిండి తినరా! తరవాత రాసుకుందువు గానిలే. నన్నిలా ఏడిపించ కురా!"

కొడుకు నిర్ఘాంతపడి చూస్తున్నాడు తల్లిని.

"నాయనా! నీకు చెప్పానా? అమ్మా అయ్యా ఆద రించలేదురా. కట్టుకున్నవాడు కనికరించలేదురా. నిన్నే చూసుకుని బతుకుతున్నానురా. నీ పిన్నమ్మలు మంచి వాళ్ళేరా. ఎక్కడున్నారోగానీ నిన్ను ఎత్తుకుని తిప్పే వారు. తినెయ్యమ్మా, ఈ పెరుగన్నం తినెయ్యి!"

నాగరత్నం రెండడుగులు వేసి కాంతమ్మ దగ్గిరికి వెళ్ళింది — "పెద్దమ్మా! రామం వొచ్చేశాడు. చూశావా అసలు?"

"వొచ్చేశాడా? అప్పుడే బడి వొదిలేశా రామ్మా?"

"బడి కాదు, తిరపతి వెళ్ళాలని వెళ్ళారుగా? రైళ్ళు ఆగిపోయాయంట! వెనక్కి వచ్చేశారు. ఇదుగో రామం చూడు..." అంటూ నాగరత్నం రామం వేపు చూపిం చింది.

కాంతమ్మ, కొడుకు వేపు చూసింది —కొత్త మని షిని చూసినట్టు. "అబ్బే, మా రామన్న బళ్ళోకి వెళ్ళా డమ్మా! అప్పుడే రాడు. చెట్లూ పుట్టలూ అన్నీ వాడికే. వాకిట్లో చెట్టెక్కినట్టున్నాడు" అంటూ గబగబా మళ్ళీ పెరటివేపు వెళ్ళింది.

"రామం! ఎవరన్నా డాక్టర్ని తీసుకు రాకూడదూ?" అంది నాగరత్నం కంగారుగా.

"అవును, వెళ్తాను. నేను వచ్చేదాకా నువ్వు ఇక్కడే వుండు అక్కయ్యా!"

గీత, భర్తతో "ఇంత వానలో ... ఇప్పుడు వెళ్ళారా? రేపు చూపించకూడదూ?" అంది.

రామం విసురుగా తలతిప్పి "ఏంటీ, మనిషి అలా వుంటే రేపు చూపించాలా!" అన్నాడు కోపంగా.

గీత మళ్ళీ నోరెత్తలేదు.

నాగరత్నం ఏదో ఆలోచన వచ్చినట్టు — "రామం, పెద్దమ్మని నువ్వు పలకరించు ఒకసారి" అంది.

వెంటనే రామం తల్లి దగ్గిరికి నడిచాడు — "అమ్మా! నేనమ్మా! నేనూ ... రామాన్ని ... తిరపతి వెళ్ళలేదు. వచ్చేశాను. అమ్మా! నేనూ...."

కాంతమ్మ కొడుకు మొహంవేపు అలాగే చూసింది.

"అమ్మా! ... అమ్మా! నేనమ్మా!"

కాంతమ్మ అలాగే చూసింది.

"అమ్మా! అమ్మా!" అని పిలుస్తూనే వున్నాడు

కొడుకు.

ఆ పిలుపు వినపడ్డప్పుడల్లా తల్లి మొహంలో ఏదో మార్పు కనపడింది.

"అమ్మా! నేనమ్మా!"

"వొచ్చేశావా నాయనా! బడి వొదిలేశారా?"

"ఆఁ, వొదిలేశారు. వొచ్చేశానమ్మా!"

"వొచ్చేశావా? రామానివా?"

"అవునమ్మా! నేనే రామాన్ని. అన్నం పెట్టు నాకు. ఆకలిగా వుందమ్మా! తొందరగా పెట్టు!"

"అబ్బే! మా రామం బళ్ళోకెళ్ళాడు. ఎక్కడో చెట్ల మీద ఆడుతూ వుంటాడు. చెప్పిన మాట వినడు" అంటూ తల్లి మళ్ళీ వాకిలి వేపుకెళ్ళింది.

నాగరత్నం రామానికి మళ్ళీ చెప్పింది — "డాక్టర్నే తీసుకురా. ఏదైనా మందిస్తాడు. రాత్రంతా నిద్ర పోతుంది. తెల్లారికి బాగుంటుందేమో!"

"అక్కయ్యా! నేనొచ్చేదాకా నువ్వు వెళ్ళకు" అని మళ్ళీ చెప్పి, రామం వానలో తడుచుకుంటూ గబగబా వెళ్ళాడు.

నాగరత్నం, గీతతో — "రాత్రికి మీరిద్దరూ ఏదన్నా తినాలిగా? పొయ్యి అంటించి అన్నం వండు. అత్తగారు పూట పూటా మీకు చాకిరీలు చేసింది. ఈ పూట కూడా అత్తే చేస్తుందనుకుంటున్నావా?" అంది.

గీత మొహం ముడుచుకుని లేచి వంటింట్లోకి వెళ్ళింది.

""నాయనా, రామన్నా, రెండు ముద్దలు తినరా!" అంటూ కాంతమ్మ మళ్ళీ వాకిట్లోకి బైల్దేరింది.

[1968 జులైలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీ ప్రచురించిన 'కథామందారము' అనే, వేరు వేరు రచయితల కథల సంకలనంలో] ★

### ఈ కథ గురించి:

ఈ కథ రాసినప్పుడు దీనికి 'ఆడది' అనే పేరు పెట్టాను. 'కథామందారం'లో ఇది ఆ పేరుతోనే వుంది. తర్వాత ఇది ఎక్కడా రీప్రింటు అవలేదు. ఇప్పుడు, దీన్ని చదివి అక్కడక్కడా దిద్దాను. 'ఆడది' అనే పేరు దీనికి సరిపోయినట్టుగా ఇప్పుడు అనిపించడం లేదు. 'తల్లి లక్క వంటిదీ, బిడ్డ రాయి వంటిదీ' అనే సామెత ఒకటి వుంది. అలాంటి పేరు పెడదామా — అనుకున్నాను. కానీ, మంగమ్మలాంటి మనిషి, తను బిడ్డగా వున్నప్పుడు తల్లిని పీడించే రకం. అలాగే, తను తల్లిగా వున్నప్పుడు బిడ్డల్ని పీడించే రకం. ఈ మనిషికి ఎప్పుడూ 'రాయితనమే'. కాంతంలాంటి మనిషి, తను బిడ్డగా వున్నప్పుడు తల్లిని ప్రేమిస్తుంది; తను తల్లిగా వున్నప్పుడు బిడ్డల్ని ప్రేమిస్తుంది. ఈ మనిషికి ఎప్పుడూ 'లక్కతనమే'. కాబట్టి, 'తల్లి లక్కా, పిల్ల రాయీ' అనేది. ఈ కథలో మనుషులకు పనికిరాదు. 'తల్లీ కొడుకులు' అనే పేరు కొంచెంగా సరిపోతుందని, ఇప్పుడు కథ పేరు ఇలా మార్చాను.

చిన్నప్పుడు నాకో సంఘటన తెలుసు. మా బంధువుల్లో, ఒక కొడుకు, తల్లిని గిట్టనిచ్చే వాడు కాడు. ఎందుకంటే, తల్లి, 'అందంగా' వుండదట! 'అందంగా వుండడం' అంటే ఏంలేదు. తెల్లగా వుండాలి. ఆ తల్లి నల్లగా వుంటుంది. కొడుకు కూడా నలుపే. కోడలు తెలుపు. ఆ కొడుకు, దేవుడి గుళ్ళకు వెళ్ళినా తల్లిని తీసుకు వెళ్ళేవాడు కాడని బంధువులు చెప్పుకునే వారు. ఆ తల్లి పేరు రాజమ్మ. కొడుకు పేరు వెంకటేశ్వరరావు. ఇవి నిజం పేర్లే. మేము, రాజమ్మని 'రాజం పెద్దమ్మా' అని పిల్చేవాళ్ళు. ఆ తల్లీ కొడుకులు ఇప్పుడు లేరు. అతని పిల్లలకి పుస్తకాల వాసన గిట్టదు కాబట్టి, తండ్రి ఎంత బుద్ధిమంతుడో తెలుసుకునే మార్గం లేదు వాళ్ళకి. వాళ్ళు తెలుపో నలుపో నాకు తెలీదు.

ఈ కథ ఇప్పుడు చదివితే, చిన్నప్పుడు ఎంతో తెలిసి, తర్వాత మర్చిపోయిన మాటలు కొన్ని కనపడ్డాయి. జుట్టు చిక్కులు తీసుకునే చిక్కట్టూ, సామాన్లు పెట్టుకునే మసినీ, పొయ్యిలో వుండే పొంత కూడా కనపడి ఆశ్చర్యం వేసింది. 'చిక్కట్టు' ఎలా వుంటుందో ఇప్పటికీ సరిగా గుర్తు రావడం లేదు. జీవితాల్లోంచి ఆ వస్తువులు పోయి, ఆ మాటలూ పోయాయి! ఇలాగే, చిన్నప్పటి మాటలు ఇంకా ఎన్ని పోయాయో అని ఒకటే దిగులేస్తోంది.

18-6-2004